తాగునీటి సమస్య
పరిష్కారానికి కృషి

తాగునీటి ఫిల్లింగ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

బండ్లగూడ, ఏప్రిల్ 9: బండ్లగూడలో తాగునీటి సమస్య పరిష్కారానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో బుధవారం జలమండలి అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడ ఏర్పాటుచేసిన ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా వీఎన్టీ కాలనీ,నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీ హిల్స్ రాధానగర్ తదితర ప్రాంతాల్లో మంచినీటి సరఫరా చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. క్యాన్ నంబర్ ఉన్నవారు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకుంటే 5000 లీటర్ల మంచినీటిని ట్యాంకర్ ద్వారా నీటిని పొందవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ మహేందర్ నాయక్, డీజీఎం మహేష్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, మాజీ మేయర్ మహేంద్ర గౌడ్, మాజీ కార్పొరేటర్ పద్మావతి , స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజలను లూటీ చేయడానికే
గ్యాస్, డీజిల్ ధరల పెంపు

ముషీరాబాద్: గ్యాస్, డీజిల్ ధరలు పెంపు ప్రజలను లూటీ చేయడానికే అని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు బుధవారం ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటికే జీఎస్టీ వసూళ్ల పేరుతో ప్రజల జేబులు గుల్ల చేస్తున్న కేంద్రం ధర పెంపుతో మోయలేని భారం మోపుతుందన్నారు. ధరలు పెంపుతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నా కేంద్రం పట్టించుకోవడంలేదని, అసంఘటిత కార్మికులు, పేద ప్రజలు కేంద్రం చర్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రేపు తెలంగాణ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో సీసీ రోడ్డు తవ్వి నల్లా కనెక్షన్లు తీసుకుంటున్న దృశ్యం

అంతా మా ఇష్టం..

ఇష్టారాజ్యంగా నల్లా కనెక్షన్లు • కొత్త రోడ్డు పేరుతో అక్రమ కనెక్షన్లు

బంజారాహిల్స్,ఏప్రిల్ 9: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు నడుస్తున్న ప్రాంతాల్లో అక్రమ నల్లా కనెక్షన్ల దందా జోరుగా నడుస్తోంది. గతంలో ఉన్న లైన్ సామర్థ్యాన్ని మించి ఎవరికి వారే కొత్తలైన్లు వేసుకుంటుండంతో లో ప్రెషర్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో నందినగర్‌లో ఇటీవల పాడైపోయిన సీసీ రోడ్డు స్థానంలో కొత్తగా రోడ్లను వేస్తున్నారు. కొత్తరోడ్లు వేస్తుంటే గతంలో ఉన్న పాతలైన్లు కిందకు పోవడంతో తాగునీరు సరిగా రావనే ఉద్దేశంతో కొంతమంది కొత్త కనెక్షన్లు తీసుకుంటున్నారు. జలమండలి అధికారుల వద్ద నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అక్రమ కనెక్షన్లు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 4 ఇంచుల పైప్‌లైన్ నుంచి నల్లా కనెక్షన్లు తీసుకోవాల్సి ఉండగా బస్తీలోని ప్రధాన లైన్లనుంచి నేరుగా కనెక్షన్లు తీసుకోవడం వల్ల ఎగువ ప్రాంతంలోని వారికి నీళ్లు సరిగా రావని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. కాగా ఇటీవల ఇలాంటి కనెక్షన్లపై ఫిర్యాదులు అందుకున్న జలమండలి విజిలెన్స్ విభాగం అధికారులు వాటిని తొలగించారని, పది రోజులు గడిచిన తర్వాత తిరిగి వేసుకుంటున్నారని జలమండలి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జలమండలి అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

జీతాలు రాక..కార్మికుల ఇక్కట్లు
నేటి నుంచి పనులు నిలిపివేసి ఆందోళన

శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 9 : 5 నెలల నుంచి పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని కార్మికులు తెలిపారు. బుధవారం శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులు మాట్లాడుతూ 5 నెలల నుంచి మాకు జీతాలు ఇవ్వడంలేదు. మా సమస్యలు ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు.దీంతో తాము గురువారం నుంచి విధులకు హాజరుకాకుండా నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి జీతాలు ఇవ్వాలని కోరారు. జీతాలు ఇచ్చే వరకు ఆందోళన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మణ్, స్వామి,బాలమణి,మంజుల, శాంతమ్మ, సంధ్యారాణి, భారతమ్మ పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది చంద్రరాజేశ్వరరావు



హిమాయత్‌నగర్ లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి తదితరులు

హిమాయత్ నగర్,ఏప్రిల్ 9: పేదలకు సాగు భూములు, ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటాలుచేసి ఎన్నో విజయాలు సాధించిన గొప్ప మానవతావాది దివంగత కమ్యూనిస్టు నేత చంద్ర రాజేశ్వర రావు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా బుధవారం హిమాయత్ నగర్ లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం ఆవరణలో ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యాభాస్యంలోనే రాజేశ్వర రావు వామ పక్ష భావజాలానికి ఆకర్షితులై సమాజానికి సేవలు అందించారని గుర్తు చేశారు. సుదీర్ఘ కాలం పాటు ప్రజా ఉద్యమాలను నడిపి తన ఆస్తులను సైతం పేదలకు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు ఆర్.అంజయ్య నాయక్, మారుపాక అనిల్ కుమార్,చందు నాయక్, శంకర్ నాయక్, శ్రీమాన్, రఘు, గోవింద్, శ్రీరాములు, దశరథ్, అంజయ్య, నరసింహ, రాజేందర్, సురేందర్, శివ,వినోద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 9: బీఆర్ఎస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి, జాలిగం చిత్తారి, అప్పారెడ్డి ముఖేష్, పుష్పాల లక్ష్మణ్‌లు అన్నారు. బుధవారం అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. ర్యాలీగా సభకు బయలుదేరి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శైలేష్, నరేందర్‌రెడ్డి, చరణ్‌సింగ్, రాము యాదవ్, సంతోష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి

అబద్ధాలకు కేరాఫ్‌గా కాంగ్రెస్

బండ్లగూడ, ఏప్రిల్ 9: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబద్ధాలకు కేరాఫ్‌గా మారారని బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు పేర్కొన్నారు.
బండ్లగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అబద్ధపు హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు నేడు ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో నాడు ఆరు లక్షల 47వేల 479 నూతన రేషన్ కార్డులను జారీ చేశారన్నారు. రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న కుటుంబంలో ఒక్కొక్కరికి 6 కిలోలు బియ్యం ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇంతవరకు కొత్త రేషన్ కార్డులను జారీ చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు వెంటనే కొత్త రేషన్‌కార్డులను జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజీవ్‌నగర్ కాలనీ ప్రవేశద్వారం(ఆర్చ్)ప్రారంభం

ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్ కాలనీ ప్రవేశద్వారం ప్రారంభోత్సవాన్ని బుధవారం పండుగ వాతావరణంలో నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కృష్ణశర్మ బీనిని ప్రారంభించారు. ఆర్చ్ నిర్మాణానికి సహకరించిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వినాయకసాగర్, పీఏఎస్‌మూర్తి, ఆగస్టీన్, ఎన్ ఎస్ రెడ్డి, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు. – ఎర్రగడ్డ

కార్మికుడి కుటుంబానికి ఉద్యోగుల చేయూత

తెలుగు యూనివర్సిటీ: హైదరాబాద్ సింగరేణి భవన్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న దాసు (51) ఇటీవల గుండెపోటుతో మరణించాడు. అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు తోటి కాంట్రాక్ట్ కార్మికులు, సింగరేణి అధికారులు, ఉద్యోగులంతా కలిసి రూ. 90 వేలను సేకరించారు. ఈ మొత్తాన్ని బుధవా రం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్. డీఎం సుభానీ ఉద్యోగుల సమక్షంలో దాసు కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆహ్వానం: రాజేంద్రనగర్ సర్కిల్ జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14న రాజేంద్రనగర్‌లో నిర్వహించే అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు బుధవారం ఆహ్వానపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎడ్ల కాడి సూర్యం, ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, కోశాధికారి శ్రీనివాస్, జై భీమ్ జై రామ్ వ్యవస్థాపక అధ్యక్షులు జీవన్ దాస్, మనం నరసింహ, మద్దిలేటి, సామెల్, రాజ్‌కుమార్, పంబాల రాజు, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు. –బండ్లగూడ

మీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా
రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

వ్యవసాయ యూనివర్సిటీ ,ఏప్రిల్ 9: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఉద్యోగులకు హామీ ఇచ్చారు. బుధవారం వ్యవసాయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన నాన్ టీచింగ్ రాష్ట్రస్థాయి ఉద్యోగుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని ,అందులో భాగంగా మీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రస్తుతం రూ.20 కోట్లు మంజూరు చేస్తే యూనివర్సిటీ పరిధిలోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. నాన్ టీచింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పెండింగ్లో ఉన్నాయని, దినసరి వేతనాలు కాంట్రాక్టు బేస్ చేసేవారివి ఇప్పటికి ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్నాయన్నారు వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోని నాన్ టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

హిమాయత్ నగర్‌లో జరిగిన మహాసభలో మాట్లాడుతున్న అంజయ్య నాయక్

హిమాయత్ నగర్,ఏప్రిల్ 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం తగదని తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్య నాయక్ హెచ్చరించారు. బుధవారం హిమాయత్ నగర్‌లో సమాఖ్య నగర 4వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నివాసం ఉండే గిరిజనులకు ఇంటి స్థలాలు లేకపోవడంతో మురికివాడల సమీపంలో నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇళ్లులేని పేద గిరిజనులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా గిరిజన యువతకు రుణ సౌకర్యం కల్పిస్తున్న ట్రైకార్‌లో పెండింగ్‌లో ఉన్న రూ.213 కోట్ల రుణాలను మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలోని ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేం దుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మహా సభలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, సమాఖ్య నేతలు ఆర్. శంకర్ నాయక్, చందు నాయక్, రూప్ సింగ్, హరినాయక్, నారాయణ నాయక్, రాజు నాయక్, శ్రీనివాస్, దశరథ్, శివ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి
శంషాబాద్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్

ఎంఈవో కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 9 : ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించనిచో వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. బుధవారం ఎంఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పాఠశాలలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతిలేదని వివరించారు.
మున్సిపాలిటీలోని రాళ్లగూడలో సాంక్టస్ వరల్డ్‌స్కూల్, ఏకే టౌన్‌షిప్ లోని చోటాస్కూల్,ఈరోకిడ్స్‌ప్రీస్కూల్, మండలంలోని నర్కూడలోని కాగ్నిటివ్ స్కూల్,న్యూ హుడాకాలనీలో నారాయణ స్కూళ్లకు ఎలాంటి అనుమతి లేదు. దీంతో వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. అనుమతిలేని వాటిలో తల్లిదండ్రులు వారి పిల్లలను జాయిన్ చేయకూడదని వివరించారు. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ నిబంధనలకు విద్ధమన్నారు. ఒకవేళ ఏమైనా అడ్మిషన్లు తీసుకున్నట్లుసమాచారం ఉంటే వాటి గుర్తింపు రద్దు చేయడం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని హెచ్చరించారు.

నెలలు గడుస్తున్నా..పట్టించుకోరా..!

నందినగరలో తవ్వి వదిలేసిన కాలనీ రోడ్లు

- రోడ్లు తవ్వారు.. వేయడం మరిచారు
- నందినగరలో 2 నెలలుగా ప్రజల అవస్థలు
- కిందపడి చిన్నారులకు, పెద్దలకు గాయాలు
- ఫిర్యాదుచేసినా పట్టించుకోని అధికారులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 9: మంచిగా ఉన్న రోడ్లు తవ్వారు.. రెండు నెలలైనా కొత్త రోడ్లు వేయడం లేదు. అడ్డగోలుగా తవ్వివదిలేసిన రోడ్లపై కనీసం నడిచే పరిస్థితి లేదు. చిన్నారులు, పెద్దలు రాళ్లలో కింద పడి గాయాలపాలవుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇదెక్కడో మారుమూల పల్లె పరిస్థితి కాదు. బంజారాహిల్స్ నందినగర్‌లోని ప్రజల దుస్థితి. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్డు-14లో కేసీఆర్ ఇంటి ఎదుట రోడ్డుతోపాటు సమీపంలోని 4-5 వీధుల్లో సీసీ రోడ్లను తవ్వారు. త్వరలోనే కొత్త సీసీ రోడ్లు నిర్మిస్తారని స్థానికులు భావించారు. కానీ, రెండు నెలలు దాటినా ఎవరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటి ఎదుట రోడ్డును తవ్వారు. 15-30 రోజుల్లో అక్కడ కొత్త రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. మిగతా రోడ్లను మాత్రం కాంట్రాక్టర్, అధికారులు గాలికి వదిలేశారు. ఫలితంగా అడ్డగోలుగా తవ్విపడేసిన రోడ్లపై ప్రజలు నడవలేని పరిస్థితి దాపురించింది. మురుగునీటి పైపులు పగిలి రోడ్లపైనే డ్రైనేజీ నీరు ప్రవహిస్తున్నది. కంపు భరించలేక కనీసం ఇంట్లో కూడా భోజనం చేయలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే రోడ్లు వేయకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని పలువురు స్థానికులు హెచ్చరించారు.

ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్,ఏప్రిల్ 9: నిషేధిత ఈ- సిగరెట్లను విక్రయిస్తున్న వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లోని వెస్ట్ ఎండ్ మాల్‌లో పనిచేస్తున్న శాంభవ్ జైన్ (44) అనే వ్యక్తి కొంతకాలంగా నిషేధిత ఈ -సిగరెట్లు విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. సెల్లార్‌లో కస్టమర్లకు ఈ -సిగరెట్లను విక్రయిస్తున్న శాంభవ్ జైన్‌ను అదుపులోకి తీసుకొని రూ.1.25లక్షల విలువైన ఈ -సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు శాంభవ్ జైన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏడు రోజుల జైలుశిక్ష

బంజారాహిల్స్,ఏప్రిల్ 9: మద్యం మత్తులో రోడ్డుమీద న్యూసెన్స్‌కు పాల్పడుతూ దారినపోతున్నవారిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఓ వ్యక్తికి 7రోజుల జైలు శిక్ష పడింది. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిలింనగర్‌కు చెందిన జే.సతీష్(26) అనే వ్యక్తి తరచూ మద్యం సేవించి రోడ్లపై న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాడు. రెండ్రోజుల క్రితం ఫిలింనగర్ సాయిబాబా ఆలయం వద్ద మద్యం మత్తులో రోడ్డుపై హల్‌చల్ చేశాడు. అక్కడికి వెళ్లిన పోలీసులు సముదాయించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం నాంపల్లిలోని 10వ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చారు. కేసు విచారించిన న్యాయమూర్తి నిందితుడు సతీష్‌కు 7రోజుల జైలుశిక్ష విధించారు. ఈ మేరకు నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

గోవులను రక్షించుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న మాతా నిర్మలానంద

ఖైరతాబాద్, ఏప్రిల్ 9 : గోవులను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మాతా నిర్మలానంద అన్నారు.తెలంగాణ గోశాలల నిర్వాహకులు, గోషకుల సదస్సు సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో బుధవారం సేవ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు విజయ్‌రామ్ అధ్యక్షతన జరిగింది. మతా నిర్మలానంద మాట్లాడుతూ వేదాల నుంచి సమస్త శాస్త్రాల్లో గోవుల ప్రాధాన్యత ఉందన్నారు. పంచగవ్యకు ఔషధ గుణాలుంటాయన్నారు. ప్రకృతికి, రైతాంగానికి, సామాన్యుడికి గోవు ఎంతో మేలుచేస్తుందన్నారు. కాలుష్యాన్ని నివారించే గుణం గోవులకు ఉంటుందన్నారు. యావత్ జాతికి ఉపకారం చేసే గోవులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గోశాలల పరిరక్షణకు చొరవ చూపాలన్నారు. మాపల్లె సంస్థ ప్రతినిధి నర్సింహారెడ్డి మాట్లాడుతూ గోవుల విశిష్టత అనాధిగా చెప్పుకుంటున్నారని, కాని రోజు రోజుకు ఆ జీవాలు క్షీణిస్తున్నాయన్నారు. రైతుల నుంచి గోవులు దూరమైనందుకే సకల అరిష్టాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో గో వత్సవ్ ఫౌండేషన్ ప్రతినిధి మురళీ పలోడ్, గ్రామ భారతి ప్రతినిధి ఆకుతోట రామారావు, జశ్వంత్ పటేల్, మురళీధర్, సాయిబాబా, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ వైద్యురాలు మృతి

వెంగళరావునగర్, ఏప్రిల్ 9: అనారోగ్యంతో సుస్మితా ప్రియ (30) అనే ఫిజియోథెరపీ వైద్యురాలు మృతి చెందారు. ఎస్.ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఏపీకి చెందిన సుస్మితా ప్రియ (30) సంవత్సరం క్రితం నగరానికి వచ్చి ఎస్.ఆర్.నగర్‌లోని అన్నపూర్ణ డీలక్స్ ఉమెన్స్ హాస్టల్లో ఉంటూ, బల్కంపేట లోని గ్లోబల్ చైల్డ్ కేర్ డెవలప్మెంట్ సెంటర్లో ఫిజియోథెరపీ వైద్యురాలుగా పనిచేస్తోంది. మంగళవారం ఉదయం 8 గంటలకు హాస్టల్ నుండి బయలుదేరుతుండగా నురుగులు కక్కుతూ, ఒక్కసారిగా కింద పడిపోయింది. వెంటనే తోటి స్నేహితులు 108 ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమెను పరిక్షించిన వైద్యులు అప్పటికి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె మృతి చెందిన విషయాన్ని హాస్టల్ లో ఉంటున్న స్నేహితురాలు సుస్మిత తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. సుస్మిత ప్రియ గుండెపోటుతో మరణించి ఉంటుందని భావిస్తున్నారు.

వివాహాలు కుదర్చడంలో మధ్యవర్తులదే కీలకం

చిక్కడపల్లి, ఏప్రిల్ 9: వివాహాలు కుదర్చడంలో కీలక పాత్ర పోషించేది మధ్యవర్తులని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీఎంబీఏ జేఏసీ)చైర్మన్ బీఎం అర్జున్‌రావు అన్నారు. తెలంగాణ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ జేఏసీ ప్రమాణస్వీకారోత్సవం బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ప్రముఖ సంఖ్యా శాస్త్రాన్ని నిపుణులు దైవజ్ఞ శర్మ చేతులమీదుగా బీఎం అర్జున్‌రావు చైర్మన్ ప్రెసిడెంట్ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ఉపాధ్యక్షుడు,కార్యదర్శి పదవులు పొందిన యాదగిరిరెడ్డి, శోభారాణి, మహమ్మద్ సలీం, యోహాన, కొండస్వామి పాల్గొన్నారు.

కంటోన్మెంట్ సమస్యల
పరిష్కారానికి కృషి చేయండి

బొల్లారం, ఏప్రిల్ 9: కంటోన్మెంట్ బోర్డు యాక్ట్ 2006 ప్రకారం బోర్డు ఎన్నికలు నిర్వహించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులతో కలిసి బుధవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో సీఈఓ మధుకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..గత ఐదేండ్లుగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందని, పరిపాలన విభాగం సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎనిమిదో వార్డు పరిధిలోని రిసాల బజార్ డాక్టర్ అంబేద్కర్ సామాజిక భవనం పూర్తి కాలేదని, పేద ప్రజలకు శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా త్వరగా పూర్తిస్థాయిలో నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా ఆరో వార్డు రామన్న కుంట చెరువును ప్రక్షాళన చేయాలని, మూడు, నాలుగు, ఏడవ వార్డు